క్లుప్తంగా

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం



మల్లప్ప కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి

గుడుపల్లె: గుండెపోటు కారణంగా మృతి చెందిన కుటుంబానికి వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కృష్ణ రాఘవ జయేంద్ర భరత్ తన సొంత నిధులతో రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం శనివారం అందించారు. మండలంలోని చిన్నపర్తికుంట గ్రామానికి చెందిన మల్లప్ప మృతి చెందారు. వెంటనే సమాచారం తెలుసుకుని వారి కుటుంబానికి జెడ్పీటీసీ సభ్యులు కృష్ణమూర్తి వెళ్లి పరామర్శించారు. వీరి దహన సంస్కారాల కోసం ఆర్థిక సహాయం అందించారు.

నేడు బ్రాహ్మణుల సమావేశం

పుంగనూరు: పట్టణంలోని శ్రీ హరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ మండలంలోని గుడిసెబండలో కార్తీకమాస పూజలు, వనభోజన కార్యక్రమాలు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

యూటీఎఫ్ ఎన్నికలు ఏకగ్రీవం



రామసుబ్రమణ్యం, రాజేంద్ర

కుప్పం: ఉపాధ్యాయుల యూనియన్ యూటీఎఫ్ ఎన్నికల శనివారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికల్లో కుప్పం మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా రామసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా రాజేంద్ర ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి, నూతన కమిటీకి శుభాభినందనలు తెలిపారు.

సాధారణ సమావేశం రేపు

పుంగనూరు: మండల సాధారణ సమావేశం ఈ నెల 4న ఉదయం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దీనికి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



రొంపిచెర్లలో పర్యటిస్తున్న నాయకులు, అధికారులు

సదుం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీం ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో శనివారం నిర్వహించిన రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీ వెంకటరమణారెడ్డి, నాయకులు కరీముల్లా, చిన్న నాగరాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇండోక్యాన్ వెట్ ఫార్మా ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

గంగవరం: పాల ఉత్పత్తి, పశువుల ఆరోగ్యానికి అవసరమైన ఓరల్ క్యాల్షియం విక్రయాల ఇండోక్యాన్ వెట్ ఫార్మాను గంగవరం బైపాస్ జంక్షన్ సమీపంలో శనివారం ప్రారంభించారు. క్యాన్– క్యాల్ (మ్యాక్సిమా, అల్టిమా) పశువుల ఓరల్ క్యాల్షియం సంస్థ అధినేత వెంకట అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పలమనేరు పాడి రైతుల ఆర్థిక లాభాన్ని మెరుగు పరిచేందుకు ఇక్కడ ఇండో క్యాన్ వెట్ ఫార్మా సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు శోభామణి, సూర్యనారాయణ, మండల ఏహెచ్ అధికారి సుధానిధి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమలో మెలకువలు, పాడి పశువుల ఆరోగ్య నిమిత్తం ఓరల్ క్యాల్షియం అవశ్యకతను వివరించారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ ఎద్దులగట్టు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త నారాయణప్ప శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్, పార్టీ సీనియర్ నేత కుందనం దన రెడ్డి చేతుల మీదుగా మృతుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. వైఎస్ఆర్ సీపీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు రాఘవరెడ్డి, సతీష్, శివగామి, చలపతి, గజేంద్ర పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

- మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి
- భూ పంపిణీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లి: రైతుల సంక్షేమం అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, లాభసాటి వ్యవసాయం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం స్థానిక ఓ కళ్యాణ మండపంలో పేదలకు భూపంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ఎమ్మెల్యే 356 మంది రైతులకు 348 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు భూమి పంపిణీ చేసి వారి కలను ముఖ్యమంత్రి జగనన్న సాకారం చేశారన్నారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులను తెలుసుకుని రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, బైరెడ్డిపల్లె, వి.కోట ఎంపీపీలు మొగసాల రెడ్డెప్ప, యువరాజ్, జెడ్పీటీసీ సభ్యుడు కేశవులు, ఆర్‌డీఓ మనోజ్‌రెడ్డి, నాయకులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు రేపు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె మార్గంలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి కాలనీలో ఉన్న కన్యమూల వినాయక స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 4న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఉదయం కలశస్థాపన, హోమాలు, 10 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం నుంచి ఆలయంలో అన్నదానం ఉంటుందని చెప్పారు.

భరత్ బాధ్యత మీదే..



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా

- ప్రజలతో ఎమ్మెల్సీ సతీమణి దుర్గ

కుప్పం: 'నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు చుట్టం చూపుగా మారాడు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన భరత్ కుప్పంలోనే స్థిర నివాసం ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. నా భర్త భరత్ బాధ్యత కుప్పం ప్రజలదే' అని ఆయన భార్య దుర్గా అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 23, 24 వార్డుల్లో మహిళలకు చీరలు, సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ అందజేశారు. మైనారిటీ మహిళలకు ముస్లిం సంప్రదాయ ప్రకారం చీరలు అందజేశారు. ఐదేళ్లుగా కుప్పం ప్రజలతో మమేకమై మీ ఇంటి బిడ్డ అయిన భరత్‌ను ఆదరించి ఆశ్వీరిందించాలని కోరారు. పాతపేట, విజయలక్ష్మీ రోడ్డు, మును స్వామి పురం, బీసీ కాలనీ, గాండ్ల వీధి ప్రాంతంలో పర్యటించి, మహిళలతో మాట్లాడారు. ఏళ్ల తరబడిగా చంద్రబాబును నమ్మి మోసపోయింది చాలు... ఒక్కసారి యువ నాయకత్వంపై నమ్మకం పెట్టి భరత్‌ను గెలిపించాలని ఆమె విన్నవించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో యువ నేత భరత్ మీ నమ్మకాన్ని నిలబెట్టి కుప్పం ప్రాంతాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని ఆమె అన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, స్థానిక కౌన్సిలర్ సయ్యద్ ఆలీ, రాజ్‌కుమార్, జగన్, స్థానిక నాయకులు అరుల్, ఆర్. శ్రీనివాసులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన లారీ



గాయపడిన డ్రైవర్

చౌడేపల్లె: పుంగనూరు–చౌడేపల్లె మార్గంలో పెద్దయల్లకుంట్ల సమీపంలోని మలుపు వద్ద లారీ బోల్తా పడిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, చిత్తూరుకు చెందిన డ్రైవర్ ప్రభు పుంగనూరు నుంచి లారీలో పశువుల దాణాను సోమలకు తరలిస్తుండగా, చెట్టును ఢీ కొని బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌ను 108లో పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



వేమచంద్రారెడ్డి, రవీంద్ర, మంజులరాణి

గంగవరం: యూటీఎఫ్ పలమనేరు మండల నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా హరిగోవిందయ్య, అధ్యక్షుడిగా వేమచంద్రారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా మంజులరాణి, బషీర్, ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర, కోశాధికారిగా భాస్కర్ ఎన్నికయ్యారు. అలాగే మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లను సైతం ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తూ అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు గురుమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థులు, వైద్య సిబ్బంది మానవహారం

వి.కోట: సరైన జాగ్రత్తలను పాటించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారి నుంచి దూరంగా ఉండవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సామాజిక ఆరోగ్య వైద్యాధికారి మురళి సూచించారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో వైద్య సిబ్బంది, బాలికోన్నత పాఠశాల విద్యార్థులు మానవహారం చేపట్టారు. ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- కారును వదిలి నిందితుల పరార్



మద్యం కేసులను చూపుతున్న సీఐ ఎల్లయ్య

గంగవరం: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పలమనేరు ఎస్ఈబీ పోలీసులు చేజ్ చేసి పట్టుకోగా, కారును వదిలి నిందితులు పరారయ్యారు. ఎస్ఈబీ సీఐ ఎల్లయ్య కథనం మేరకు ..గంగవరం బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ జంక్షన్ వద్ద సీఐ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా, పోలీసుల బొలేరో వాహనాన్ని ఢీకొని ఆ కారు ఆగకుండా వెళ్లింది. ఆ కారును పోలీసులు వెంబడించగా, మబ్బువారిపేట బస్టాప్ వద్ద కారును వదిలి అందులో ఉన్న వారు పరారయ్యారు. కారును పరిశీలించగా 40 కర్ణాటక మద్యం కేసులు(టెట్రా ప్యాకెట్లు) ఉన్నాయి. కారులోని రికార్డులు పరిశీలించగా పాలసముద్రం మండలం బాలకృష్ణాపురానికి చెందిన తంగవేలుదిగా గుర్తించారు. మద్యం కేసులను, కారును ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల (కల్లూరు): తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం రాత్రి అందుబాటులో ఉన్న అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటి కప్పుడు పరిస్థితి సమీక్షిస్తుండాలన్నారు. ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. తహసీల్దారు శేషగిరి రావు, ఎంపీడీఓ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగనన్న



గరిగచీనేపల్లె సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్సీ కృష్ణ రాఘవ జయేంద్ర భరత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గరిగచీనేపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో మొదట వైఎస్ఆర్ సీపీ జెండా ఆవిష్కరించి, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం రూపొందించినా బడుగు, బలహీనులు, మహిళలే ప్రామాణికంగా తీసుకుని శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. ఇందుకు నిదర్శనమే అమ్మ ఒడి, ఆసరా, చేయూత లాంటి పథకాలని తెలిపారు. మనసున్న నాయకునికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అయితే జన్మభూమి కమిటీల సిఫారసు లేనిదే ఒక్కటంటే ఒక్క పెన్షన్, రేషన్‌కార్డు వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులైతే చాలు పథకాలు వెతుక్కుంటూ వెళ్లి తలుపులు కొడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకువచ్చి లబ్ధిదారులకు నాయకులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా చేశారని ఉద్ఘాటించారు. జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. .

ప్రత్యేక శిబిరాల్లో ఓటర్ల జాబితా పరిశీలన



గుండిశెట్టిపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా పరిశీలన

శాంతిపురం: పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రత్యేక శిబిరాల్లో తొలి రోజైన శనివారం ఓటర్ల జాబితాల పరిశీలన, చేర్పులు, అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ఓటర్ల జాబితా తయారీ కోసం జరుగుతున్న చివరి సవరణ కావడంతో రాజకీయ పార్టీలు చురుగ్గా వ్యవహరిస్తున్నాయి. అనర్హత, అనుమానిత ఓట్లను వైఎస్ఆర్ సీపీ, టీడీపీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు గుర్తించి బీఎల్‌వోలకు ఫిర్యాదులు చేశారు.

వలంటీర్ కుటుంబానికి పరామర్శ

సదుం: మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన వలంటీర్ చిరంజీవి(30) బ్లడ్ కాన్సర్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని పలువురు నేతలు శనివారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ ఐశ్వర్య ఉన్నారు.

బాలల భవిష్యత్తును కాలరాయకండి



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు వాసుదేవరావు, కార్తీక్, సింధు

పుంగనూరు: పేదరికంలో ఉన్న చిన్నపిల్లలను పాఠశాలలకు పంపాలని, పనికి పంపి వారి భవిష్యత్తును కాలరాయవద్దని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి శనివారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీ చేశారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ పనుల్లో ఉన్న బాలలను గుర్తించి, పాఠశాలలకు పంపాలని లేదా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు తరలించేలా తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు వివాహాలు చేయడం, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడడం నేరమన్నారు. ఇలాంటి విషయాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు విజయకుమార్, విజయకృష్ణ, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ సుకుమార్, ఐసీడీఎస్ పీవో రాజేశ్వరితోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



సోమలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సంఘమిత్రలు, వీఓ లీడర్లు

సోమల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో లింగ వివక్షకు గురికావడం, బాల్య వివాహాలు జరగడం దురదృష్టకరమని ఎంపీడీఓ నాగరాజ అన్నారు. వెలుగు సమాఖ్య కార్యాలయంలో శనివారం వీఓ లీడర్లు, సంఘ సభ్యులు, సంఘమిత్రలకు ఏపీఎం శివయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏమూలన ఏమి జరిగినా సంఘ సభ్యులకు, సంఘ మిత్రలకు తెలుస్తుందని బాల్య వివాహాలపై సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే 112, 1098 చైల్డ్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసినా అధికారులు స్పందిస్తారని తెలిపారు. అనంతరం కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆవులపల్లె సర్పంచ్ కోదండరాజు, సోమల మాజీ సర్పంచ్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నేత సాంబయ్య, ఏఓ సుధాకర్, ఏపీఓ దినకర్ బాబు, సీసీలు గంగోజీ, నరసింహులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): బాల్యవివాహాలను అరికట్టి, లింగ వివక్ష లేకుండా చూడాలని మండల గ్రామసమాఖ్య ఏపీఎం చంద్రమోహన్ తెలిపారు. పులిచెర్లలో శనివారం మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు, సంఘమిత్రలు, సీసీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా





పుంగనూరు: పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్, తహసీల్దార్, సదుం: సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

పుంగనూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను పకడ్బందీగా తయారు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్లో శనివారం బీఎల్‌వో సెంటర్లను తహసీల్దార్ సీతారామన్‌తో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో 41 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు నిర్వహిస్తామన్నారు. నిబంధనల మేరకు బీఎల్‌వోలు పరిశీలన చేపట్టాలన్నారు. ఓటర్లుగా 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు. అపోహలకు తావులేకుండా జాబితాలను సిద్ధం చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సదుం: మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 180, 185 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు ప్రచార కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు కానివారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఓటరు క్లెయిమ్‌ల పరిష్కారంపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్, డీటీలు కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

సదుం: పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నందున బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని తహసీల్దారు చంద్రశేఖర్ ఆదేశించారు. అర్హత ఉన్న వారిని ఓటరు నమోదు చేయించేలా అవగాహన కల్పించాలని చెప్పారు, అర్హత లేని వాటిని, మార్పులు, చేర్పులకు వచ్చే క్లెయిమ్‌లను స్వీకరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటు హక్కుపై అవగాహన

సోమల: మండలంలో 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనివాస ప్రవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. నేడు అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రామ్మూర్తి, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జనార్దన్ నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా జాబితా

రొంపిచెర్ల: ఓటర్ల జాబితా తప్పులు లేకుండా పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తహసీల్దారు అమర్‌నాథ్ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. అర్హత ఉన్న వారిని ఓటర్లుగా చేర్పడంతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌ఓలకు సూచించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీటీ వెంకటరమణారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రత్యేక శిబిరాల పరిశీలన

పులిచెర్ల(కల్లూరు): ఓటర్ల నమోదు కోసం కల్లూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను శనివారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక శిబిరాల్లో బీఎల్వోలు దగ్గరుండి వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని స్వీకరించాలన్నారు. అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శేషగిరి రావు, కల్లూరు పంచాయతీ ఈఓ యుగంధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటరు జాబితా తనిఖీ

గంగవరం: బీఎల్‌ఓలు తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ వెరిఫికేషన్‌కు సంబంధించి మార్పులు, చేర్పులను బాధ్యతగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారం–7 వెరిఫికేషన్‌లో బీఎల్‌ఓలు, బీఎల్ఏలు మాత్రమే ఉండాలన్నారు. ఈపీ, జనరల్ రేషియో ఎక్కువ కాకుండా ఉండాలని, ఫారం 6, 7, 8ని సరి చూసుకోవాలని తెలిపారు. అర్హులైన వారి నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఓటరు ఇంటి తలుపునకు నంబర్ లేకపోతే దగ్గరగా ఉన్న డోర్ నంబర్ వేయాలని సూచించారు.